


## పాఠశాల

నూతన భోగరాజుగారు, సమాజాన్ని దిద్దాలనీ, భావి పౌరులను, మంచి మార్గాన నడపాలనీ, ప్రగతి సంపాయించాలనీ యువతరం నూతనోద్దేశాలతో ముందుకు నడవాలనే సదుద్దేశంతో, ఒక మదరసా స్థాపించి నడుపుతూ ప్రాస్పెక్టస్ తయారు చేసారు. దానిలో గ్రూపూ, మెయినూ సిలబస్ ప్రింట్ చేయించారు. అర్జీలు కోరబడుచున్నవి. ఆలసించిన ఆశాభంగమగును. లిమిటెడ్‌గానే సీట్లున్నాయి. వేగిరం ధరఖాస్తులు పంపండి. హాస్టలు వసతి గలదు. విలాయతీ రిటరన్డ్ కుక్స్ నోరూరించే కుకీస్ చేయుదురు. ఘుమఘుమలాడుతూ వంట చేయుదురు. బేకరీలలోనూ రెస్టారెంట్లులోనూ తలలో నాల్కలవలె పనిచేసిన హెల్పర్స్ ఉన్నారు. అనుభవశాలురు సర్వర్స్. వంట మోడరన్ యంత్రాల సాయంతోనే చేయుబడును. మైక్రోవేవ్ వోవెన్ గలదు. ఇన్‌స్టంట్ ఫుడ్స్ వడ్డించబడును. నాన్‌వెజిటేరియన్‌ల వంటశాల వేరు. ధరఖాస్తులు లభించు చోట్లు : ముఠామేస్త్రీ యింట్లో అద్దెకున్న నక్కానరావు, నక్కలపేట. మెసేజ్ విడుదల చేయచ్చు. ఫోన్‌చేయచ్చు. ఇ-మెయిల్ పంపచ్చు. స్థాపకుడు, నూతన భావరాజు. ఉద్యోగ విరమణ పొంది, దేశసమైక్యతకై శ్రమింప దలచాడు.

దూరదర్శన్ మీదా ప్రకటన పడింది.

చింతపిక్కల గచ్చరాజూ వాని మిత్రులూ, ప్రాస్పెక్టస్ తెచ్చి సామూహికంగా వివరాలు చదివారు. చాలా ప్రోత్సాహమిచ్చిందా ప్రాస్పెక్టస్. ఆనందరావు ఎక్సైటైపోయి ఆనంద తరంగాల్లో మునకవేశాడు. దరఖాస్తులు పడేస్తే యింటర్వ్యూలున్నాయి రమ్మని పతాయిస్తూ జవాబిచ్చింది. సామూహికంగానే వెళ్లారు యింటర్వ్యూలకి.

తోడేల్‌రావు నవ్వు మొహంతో అడిగాడు. ''యెన్నేళ్ల కోర్సండీ ఫౌండరుగారూ? హాస్టల్ వివరాలు చదివి, రుచికరమైన ఇన్‌స్టంట్ ఫుడ్ లభిస్తుందని అంతా వర్డ్ బై వర్డ్ చదవలేదు. ఈ మదరసాలో చేరాల్సిందేనని

మనసు వురకలేసింది''. భోగరాజుగారు శాంతంగా అన్నారు. ''అది మీ కుశాగ్ర బుద్ధి బట్టి వుంటుంది. అంతేగాకుండా హెరిడిటరీని బట్టి వుంటుంది. రక్తంలో వుంటుంది గ్రహించే శక్తి. ఫరవానై. ఫెయిలైనా మళ్లా మళ్లా అప్పియర్ కావచ్చు. పార్ట్ బై పార్ట్ పాసు కావచ్చు. మొత్తానికి సఫలీకృతుల్ని చేసే పంపుతాము. నాదబ్రహ్మగారు సంగీతం నేర్పుతూ అన్నంగూడా అంటే బోర్డింగ్ గూడా రన్‌చేస్తూ కొంత స్టాండర్డు వచ్చాకే విద్యార్థులను పోనిచ్చేవారుట. జీనియస్సులు ఆర్నెల్లలోనే కోర్సు కానిచ్చి డిగ్రీ లాక్కుని వెళ్లిపోతారు. డడ్డులకు ప్రైవేట్ క్లాసులు పెట్టి కోచింగిస్తాము. స్లో అండ్ స్టెడీ విన్స్ ద రేస్. చేతనౌతుంది''. మిస్ డబాయమ్మ అడిగింది. ''వయోపరిమితి లేదా సార్?'' భోగరాజుగారు ''లేదమ్మా, మాటలు నడకా వచ్చినప్పటినించీ, నూరేళ్లవరకూ యెవరైనా మదరసాలో చేరచ్చు. నేర్పు, ఓర్పూ పట్టుదలా చాలు. డిగ్రీ పనికివస్తుంది. రిటైర్‌మెంట్ అనేది వుండదు''.

మిస్ డబాయమ్మ కళ్లు కళకళలాడాయి. ''నా వినతి పత్రం చదివారా సార్?''.

భోగరాజుగారు ''ఆ పరిశీలించా. మంచి గ్రూప్ తీసుకున్నారు. మెయిన్ వెరీ గుడ్. యెందుకనంటే పీక్కు తినటం అందరికీ రాదు. ధారణ కావాలి. ఆ గ్రూపూ ఆ మెయినూ చాలా మంది తీసుకోరు. భయపడతారు. సిగ్గరులసలే తీసుకోరు''. మిస్ కుండమ్మ నవ్వుతున్నది. ''నేనంత తెలివిగల దాన్ని కానండి. వేలు పెడితే కొరకలేను. వెన్న పెడితే మింగలేను. నన్ను కన్నతల్లి పేరు నలువరాణి. నన్ను పెట్ నేమ్‌తో పిలుస్తుంది'' అని నవ్వుతున్నది.

''యేమని పిలుస్తారు నలువరాణిగారు? తెలుసుకుందాము''. కుండమ్మ యింకా నవ్వుతూ చెప్పింది. ''నీళ్ల కుండా, నీళ్లకుండా! యివాళ నీళ్ల కుండకి చిల్లిపడలేదే? యెంచేతబ్బా? వానొస్తుందేమో అని నవ్వి వెళ్లిపోతుంది. గ్రూపు బాగుందా సార్?''

''బాగున్నది బేబీకుండ్. పేరుకు తగ్గ మెయిన్ మీది. మీకు క్రోకడైల్ టియర్స్ కార్చటం తేలిగ్గా వస్తుంది. మదరసా ఫస్ట్ వస్తారు. ''గాబోలు'' అనే పడికట్టు పదం వాడుతూ మీ కిష్టమైన పని చేయిస్తారు. ఇష్టంలేని పని చేయరు. వరిగాలు నెప్పి వరిచెయ్యి నొప్పి అని శోకం అందుకుని మనుషుల్ని ఆకట్టుకుంటారు. వారం వారం మౌఖిక పరీక్ష వుంటుంది. భోల్లుమని యేడిచి కుండెడు కన్నీళ్లు జలజలా రాల్చటం వచ్చిందా లేదా చూసి, రాకపోతే, స్పెషల్ కోచింగ్ యిచ్చి సఫలీకృతుల్ని చేసి పంపుతాము. పరీక్ష నెగ్గకపోవడం అనేది యీ మదరసా పుస్తక భాండాగారంలోని పాత్తములలోనే లేదు''.

మాస్టర్ జిగుర్రావు అడిగాడు ''నాకు మీ మదరసా ఆశయాలు నచ్చాయి సార్. యెందుకంటే, గ్రూపులూ, మెయినూ నాకు యిష్టమైనవి. నచ్చనవీ, కఠినమైన గ్రూపు తీసుకుని ఫెయిలయే కన్న, నచ్చిన గ్రూపు మెయిన్‌తో రాంక్ తెచ్చుకోవచ్చు. ఫస్ట్ టైం పాస్ అయితే గర్వపడచ్చు. విలాయతీ వెళ్లచ్చు. చిన్న సందేహం. ప్రాస్పెక్టస్ డిటైల్డ్‌గా చదివాను. తిష్ఠ వేయటం, తేవిణీ వేయటం అంటే అర్థంగాలేదు సార్'' నవ్వు మొహంతో అడిగాడు. కుతూహలము వినిపించింది గొంతులో. భోగరాజు గారి మొహాన నవ్వు వెన్నెలలు వచ్చాయి. ''ష్యూర్ థింగ్. మన తెలుగు భాషలో మంచి పదాలు శ్లేష కవిత్వం మాయమవుతున్నాయి. పరభాషలో చోటు చేసుకుంటున్నాయి. బౌద్ధం చోటు చేసుకుని అహింస అహింస అని వాడుతూ మన శస్త్ర చికిత్సను తుడిచేసిందట. శస్త్ర పరికరాలు దొరకని పురావస్తు శాఖ వారన్నారు. ఇంట్లో చేరి వ్యధ కలిగించే హిట్లరు మహాశయుడిని కదిలించి పంపేయాలని ప్రయత్నించేవారట యింట్లోనివారు. మరింతగా అక్కడే వుండే మార్గాలు చూచేవాడట మహాశయుడు. బయోగ్రఫీ వ్రాశాడు. మొండిగా మూర్ఖంగా జవాబునిస్తూ వుండగలగటం మానుషస్తులకు రాదు. మునుపు వారిని సువారపు దొరలు అనేవారు గౌరవంగా. భాగ్యశాలికి బంధువులౌతారు. కనక తిండిపెట్టి గౌరవంగా చూడాలి. వసంతసేన లేదా చారుదత్త లేదా మృత్‌శకటిక అనే

నాటకంలో రాజస్యాలకుడు, భారతంలో శకునీ అట్టివారే. శకారుడు మాటిమాటికీ నేనెవరో తెలుసా, రాజుగారి బావమరిదిని' అంటూ వుంటాడు'' అని విశదీకరించాడు.

'' ఇంటరెస్టింగ్‌గా వున్నదండి. థాంక్స్ ప్రాక్టికల్సుంటాయా సైన్సు సబ్జక్టు్సకు?. సపోజ్ వున్నాయంటే చేసి చూపే చూపించే డెమాన్‌స్ట్రేటర్సున్నారా?'' అనడిగాడు మర్యాదగా.

'' ఇది సైన్సే మిస్టర్. అసలు మాట్లాడుటమనేదే సైన్సు. మాటల చేత దేవతలు మన్నన చేసి వంబులిత్తురు అన్నారు. మాటల యీటెలతో యుద్ధం చేశారంటారు. మీ మెయిన్ ''అనుకున్నది సాధించటం'' కదూ మిస్టర్ జడ్వెసిల్ రావూ? సిగ్గువిడిచేస్తే మూడులోకాలూ జయించవచ్చుట. గెలుపే ముఖ్యం. ఎలా గెలిచామనిగాదు. బైహుక్ ఆర్ క్రూక్. కృష్ణపరమాత్మ పాండవులుకలాగే విక్టరీ తెచ్చిపెట్టాడు. పరమాత్మే అలా చేస్తే మనమనగా యెంత? చివరికి మేనత్త కుంతినీ వదల్లేదు. తెలుసుగా?'' అన్నాడు నవ్వుతూ.

''తెలియదండీ. చెప్తే వింటా''

''దానికేం చెప్తా. విను మిస్టర్. గెలుపుకోసం జిగురుపట్టించాలన్నాడు బావ ధర్మజునితో. ధర్మజుడు తాత సర్వసైన్యాధిపతి కాగానే వెళ్లి దర్శించి, 'తాతా! నిన్ను మేము చిత్తుచేయగలమా, కల్ల. మా గతేమిటి?' అని బేలలాగా చూచాడు దణ్ణం పెట్టాడు. తాత నవ్వి ''శిఖండి మొహం చూస్తూ యుద్ధం చేయను'' అన్నాడు. అర్జునుడు శిఖండిని తెచ్చి ముందుంచి, అడ్డంగా పెట్టుకుని తాతను ఓడించాడు. ప్రేమా గౌరవమూ వున్నాయని అని చూపటానికి, తాత నేల మీద తల ఆన్చను అనగానే అంపశయ్య తయారుచేసి దాని మీద తాతనుంచాడు. గంగ నీరే తాగుతా అంటే, బాణం వేసి పాతాళగంగను ధారగా తెప్పించి తాత గొంతు తడిపాడు. తర్వాత గురువుకి జిగురు పట్టించమని బావను తోలాడు పరమాత్మ. ధర్మజుడు గురువును, సర్వసైన్యాధిపతిని దర్శించి, దణ్ణం

పెట్టి, ''గురూ నిను గెలవలేమని తెలుసు. గెలిచే మార్గమే తెలియదు'' అన్నాడు తలవంచి. చేతులు కట్టుకుని క్రోక్‌డైల్ టియర్సు రాల్చాడు. గురువు కరిగి నీరై, ''వినరాని మాటా అనరాని నోటా'' అని ధర్మజుని వదిలించుకున్నాడు. దాన్ని కోడ్ చేసింది పరమాత్మే. అశ్వద్ధామ చిరంజీవి. గురుపుత్రుడు. వాడు పోయాడని ధర్మరాజు అసత్యమాడడు. ఆ గడ్డు సమస్యనూ టాకిల్ చేశాడు పరమాత్మ. బావను జిగురులాగా పట్టుకుని, ''బావా! నేడు అశ్వద్ధామ అనే యేనుగు యుద్ధ రంగం మీద నేల కొరిగింది. అది సత్యమే. ''అశ్వత్థామ హతః కుంజరః'' అను. తక్కినది నే చూసుకుంటా గెలవాలి. గెలుపు ముఖ్యం. అది మరువకు. అని లాక్కెళ్లి యెత్తైన చోట నిలబెట్టాడు బావని. ధర్మజుడు ''అశ్వద్ధామ హతః'' అని పెద్దగా అంటూ 'కుంజరః' అని హీనస్వరంతో అంటుండగా కృష్ణుడు కంచు తప్పెటలు వాయింపించాడు. గురువుకి కుంజరః వినపడక ''పుత్రా చిరాయువనుకొంటి'' అంటూ అస్త్ర సన్యాసం చేసి ఒరిగిపోయాడు. ధృష్టద్యుమ్న వచ్చి గురువు గొంతు కోశాడు. తర్వాత కర్ణుడుని ఓడించటం కోసం పరమాత్మ తన మేనత్త కుంతిని జిగురుగా ప్రిపేర్ చేశాడు.

''అత్తా నువెళ్లి కర్ణుని మెప్పించి యేదైనా వరమడిగి తెచ్చుకోవాలి''. కుంతి బెదిరిపోయి, ''తిడతాడేమో కృష్ణా'' ఇపుడే యెందుకు గుర్తొచ్చాను'' అంటాడేమో '' అన్నది. ''యేమన్నా పడాలి అత్తా మరి గెలుపు రావాలి. వాడు సామాన్యుడు గాదు. అస్త్రాలు సంపాయించాడు. నేనే ట్రై చేశాగాని వాడు లొంగలేదు. తల్లివని నీకు లొంగచ్చు. వెళ్లిరా'' అని తోలాడు కర్ణుని గుడారానికి. విధి లేనట్టు కుంతి మొహం వేళ్లాడేసుకుని, కాళ్లీడ్చుకుంటూ వెళ్లింది. కర్ణుని ముందు వల వలా యేడ్చింది. వాడి జన్మరహస్యం చెప్పి ''తమ్ములనేం చేయదలచావు నాయనా!'' అన్నది. ''అమ్మా! కన్నతల్లిని కళ్లారా చూశాను. ఆమె తానే వచ్చి నన్ను వేడుకుంటే వూరికే పంపుతానా? నిన్ను పరమాత్మే పంపాడని తెలుసు. నా జన్మరహస్యమూ తెలుసు. సూర్యదేవుడే స్వయంగా వచ్చి చెప్పాడు. అయినా నిన్ను నొప్పింప లేను. ఊరికనే పంపివేయనూ లేను.

నాకు అర్జునుని మీద తప్పితే తక్కిన సోదరుల మీద పగలేదు. పాండుపుత్రుడు నా తమ్ముడర్జునునికి కృష్ణుని సాయమున్నది. అయినా వానిని వదలను. తక్కిన సోదరులతో యుద్ధం చేయను. వదిలేస్తాను. అదీ నేను నీకిచ్చే వరం. అర్జునుడు పోతే నాతో కలిపి నీ కైదుగురు పుత్రులుంటారు. అర్జునుడు గెలిస్తే పాండు పుత్రులైదుగురూ వుంటారు. సంతోషంగా వెళ్ళు అమ్మా'' అని గౌరవంగా పంపాడు కర్ణ. ధర్మజుడొచ్చి యెదురుగా నిలబడితే, ''ధర్మజా! నీ తమ్ముడ ర్జునుడేమైనాడు? నిన్ను పంపాడేం? భయపడ్డాడా? యుద్ధభూమి వదిలి ఫో. నాకు కోపం తెప్పించకు. నిన్ను చంపక వదిలేస్తానని మీ అమ్మకు వరమిచ్చాను. ఫో. నీ తమ్ముడర్జునుని పంపు'' అని హేలన చేసి, నొవ్వనాడి ధర్మజుని పంపేశాడు కర్ణుడు''.

''చెప్పటం బాగున్నది సార్. డెమాన్‌స్ట్రేటర్సూ యింత బాగా పనిచేస్తారా సార్?''.

'' ఆ వాళ్ళింటి పేరే జిడ్డు. డెమాన్‌స్ట్రేటరు కవిగూడాను. టి.టి. దేవస్థానం వారు, దైవం మీద కవిత్వం అల్లినవారికి ముప్ఫై వేలిస్తారని తెలిసి, అల్లివున్న కవనం చంకన పెట్టుకు వెళ్ళి వారిని జిడ్డు పట్టించి పారితోషికం డిమాండ్ చేశాడు. వాళ్ళో పట్టాన శాంక్షన్ చేయక కుశ్శంకలతో ఇన్‌సల్ట్ చేశారు. '' ఆ కవనం దైవం మీద అల్ల లేదు నువ్వు. నీ తల్లిదండ్రుల మీద అల్లావు. అదీ అనుకరణో అనుసరణో అంటున్నారు కమిటీ వారు. మౌలికా నికేట పారితోషికం''. నిరుత్సాహపడక, నొచ్చుకోక, వారి వద్దే వుండి వారిని సేవిస్తూ పరిచర్య చేస్తూ, హెల్ఫ్‌ఫుల్‌గా గూడా వుండి, నిత్యమూ కొంచెం వినిపించి మౌలికమేనని, దేశసమైక్యత కోసం, దైవకృప అవసరం అని చెప్తూ వెంకన్నా పద్మావతీలతో మొరపెట్టి, ''మీ బిడ్డలను చల్లని చూపుచూడండి'' అని కవనం అల్లానని నమ్మించి, ఒప్పించి పారితోషికం కొట్టుకొచ్చాడు'' అని నవ్వాడు భోగరాజు.

'' ఇపుడు బాగా నమ్మకం కలిగింది సార్. టరమ్ ఫీస్ కట్టేస్తా'' అని లేచిపోయాడు జిగుర్రావు.

అక్కడున్న అర్జీదారులనోసారి చూసి వినతిపత్రం చూస్తున్నాడు నూతన భోగరాజుగారు.

గోడగడియారం లంచ్ టైమ్ చూపుతున్నది.

అప్లై చేసిన యువతి తన పేరు విని లేచి వచ్చి యెదురుగా నిలబడింది. కూచోమని కుర్చీవేపు చూపాడు తర్జని.

''లేడీ డెమాన్‌స్ట్రేటర్సున్నారా సార్?''

''అఫ్‌కోర్స్. వున్నారు యంగ్‌లేడీ. వారు ఆర్టిస్ట్సు గూడాను'' అని బెల్ నొక్కాడు భోగరాజు. ఒక లేడీ ప్రత్యక్షమయింది. కుర్చీ వేపు తర్జని చూపాడు భోగరాజుగారు.

హెవీ మేకప్ చేసుకున్న లేడీ డెమాన్‌స్ట్రేటరు ఆసీనురాలై అక్కడున్న వారిని చూసింది. పెదిమలు బిగించి యేడుపు దిగమింగుతున్నట్టు కనబడింది. మనిషి బాగా యెరుపు. పంజాబీ సిల్క్ డ్రెస్‌లో అట్రాక్టివ్‌గా వున్నది. వల్లెవాటూ హైహీల్సూ మాచ్ అయినై. జుట్టు దువ్వి వదిలేస్తే వీపంతా కప్పిందా నల్లని జుట్టు. షాంపూ యాడ్‌లో బొమ్మలాగా వున్నది జుట్టు.

''కానీ'' అన్నట్టున్నాయి, భోగరాజుగారి చూపులు.

బేల చూపులూ, బిత్తర చూపులతో డెమాన్‌స్ట్రేషన్ మొదలైంది. గుడ్లనీరు కుక్కుకుంటో నోట్లో చిన్న రుమాలు కూరుతూ, వెక్కి వెక్కి యేడిచింది. భొళ్లుమన్నది. యేడుపు ఆపుకున్నట్టు వెక్కిళ్లు పెట్టింది. జలాజలా కన్నీళ్లు చెంపలమీదుగా జారి, కింద టపటపాపడి, సన్నని నీటిపాయ యేర్పడింది. పెదిమలూ మొహం దానిమ్మపండు గింజల రంగులోకి వచ్చాయి. మొహాన చేతులుంచుకున్నది. యెర్రని చేతులలో రుమాలా. నెయిల్ పెయింట్ యెరుపే.

అమ్మాయిలు నోళ్లు దెరిచారు. అంత యేడుపెందుకో తెలియక ఒకమ్మాయి లేచి వచ్చి లేడీ డెమాన్‌స్ట్రేటరు తలనిమిరి వీపుమీద రాచి, సూదింగ్

వర్డ్స్ చెప్పింది. డెమాన్‌స్ట్రేటరు సంబాళించుకుని చేతులు తీసేసి తలెత్తి తడి కళ్లతో నవ్వి లేచి వెళ్లిపోయింది.

అర్జీదారులు కూచున్నారు.

ఫ్యాన్ వచ్చి, ''సర్! మీ ప్రకటన దూరదర్శిని మీద చూసిన ఒక వృద్ధనారి, షష్టిపూర్తి అయిపోయిందేమో, దరఖాస్తు పెట్టారుట. ఇంటర్వ్యూకి రావాలన్నారుట మీరు. వచ్చేశారు వృద్ధ నారీ. ఆమె గ్రూపు చెప్తూంటే నవ్వొచ్చింది సార్ నాకు. కళలు మార్చటం, ప్లేటు ఫిరాయించటం, తంపులు పెట్టటం మెయిన్, డబ్బు వాడి ధుర్భాషలు ఆడటం'' అంటూ అటుచూసి ఒక యువకుని చూసి వెళ్లి, ''నువ్వుట్రా బావా! ఈ వ్యూల్లో వున్నావని నాకు తెలియదే. వెరిగుడ్ మదరసాలో చేరాలని అర్జీ పెట్టుకున్నావా? సెల్ఫ్ యెంప్లాయ్‌మెంటు నేర్పుతారు. లేదా జాబ్ లాగచ్చు. అంత యూజ్‌ఫుల్ సబ్జక్ట్సున్నాయి మదరసాలో'' అని ఆశ్చర్యపోయి నోటిమీద చెయ్యి వేసుకుని ''అరె! మనిషిని పోలిన మనిషి. సో మచ్ రిజెంబ్లన్స్. నా మేనబావనుకున్నాను సుమండీ మిమ్మల్ని చూసి''.

''మీ పేరు గూడా కొంచెం తేడాతో అదేనేమో. తుమ్మ జిగురు పేరు'' అని భావరాజు గార్ని చూసి

''రమ్మనేదా సార్ వృద్ధ నారిని'' అని యికిలించాడు.

'' ఆవిడే వస్తుందిలే లోపలికి. అలా వెళ్తే మనిషికాదామె పేరే మిసెస్ స్టబ్బారన్ నీవు వెళ్ళచ్చు'' అని చేయి వూపాడు భోగరాజు.

''థాంక్యూ, థాంక్యూ'' అని వెళ్లిపోయాడు ఫ్యాన్.

''అప్లికేషన్స్ పెట్టుకున్నవారు యెవరు?'' అన్నట్టు చూస్తే, ''మరొక డెమాన్‌స్ట్రేటర్‌ని చూశారుగా యెంత బాగా విద్యను డెమాన్‌స్ట్రేట్ చేశాడో? మీకూ నేర్పుతాడు'' అన్నారు భోగరాజు గారు.

అందరూ లేచారు ''అద్భుతం సార్. మాక్కూడా నేర్చుకోవాలని

అభిలాష కలిగింది. లంచ్ టైమైంది సార్. పోతాం. సాయంత్రం అయిదింటికి వస్తాం. వృద్ధనారీ గార్ని పిలుచుకుపోతాం. వరండాలో నిలబడ్డారామె. లంచ్‌టైమ్ అని గ్రహించారు'' అన్నారు.

''గుడ్! అలా వుండాలి విద్యార్థులూ విద్యార్థినులూ'' అన్నారు నూతన భోగరాజుగారు.